పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- పర్యావరణ పరిరక్షణకు గళమెత్తిన కవులు
- స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ పాలడుగు సరోజినీదేవి



కవులను సత్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నవ భారత నిర్మాణ సంఘం సంస్థ, హెచ్‌డబ్ల్యూపీఎల్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం బాగ్‌లింగంపల్లిలో బహుభాషా కవి సమ్మేళనం జరిగింది. పర్యావరణ పరిరక్షణకై పలువురు కవులు గళమెత్తారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ పాలడుగు సరోజినీదేవి మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని... ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుతూ వాటిని సంరక్షించి కాలుష్య నివారణకు నాందీపలకాలని పిలుపునిచ్చారు. సభకు అధ్యక్షత వహించిన అఖిల భారత పద్మశాలీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుమ్మ సత్యనారాయణ మాట్లాడుతూ... మంచి వాతావరణాన్ని పౌరులకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నవ భారత నిర్మాణ సంఘం సంస్థ అధ్యక్షుడు సూరేపల్లి రవికుమార్ మాట్లాడుతూ... పర్యావరణ కాలుష్యం వల్ల నదులు, సముద్రాలు కాలుష్యానికి గురవుతూ పెను ప్రమాదాలకు కారణం అవుతున్నాయని అన్నారు. మంచి పర్యావరణం లేని సమాజంలో మనం ఎంత సంపాదించిన వృథా అవుతుందని మన ఆరోగ్య పరిరక్షణకు మంచి వాతావరణాన్ని సృష్టించుకోవాలన్నారు. సమ్మేళనంలో సుధాఠాగూర్, వడ్డేపల్లి విజయలక్ష్మి, సత్యవీణా, పోచం లక్ష్మీనర్సయ్య, డాక్టర్ కడియాల జనార్ధన్, తుమ్మ జనార్ధన్, వైరాగ్యం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు కవులను ఘనంగా సన్మానించారు.

కానరాని మాన్‌సూన్ టీమ్‌లు!

- వర్షకాలం ప్రారంభమైనా స్పందించని అత్యవసర బృందాలు
- ప్రధాన రోడ్లపై వర్షం పడితే రాకపోకలకు జంకుతున్న జనం
- అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం



హైదర్‌గూడ భారత్ పెట్రోల్ పంపు వద్ద జలమయమైన రోడ్డు

అంబర్‌పేట: చిన్న పాటి వర్షానికే రోడ్లు జలమయం అవుతున్నాయి. అంబర్‌పేట సర్కిల్–16 పరిధిలోని ప్రధాన రోడ్లపై వర్షం కురిసిన ప్రతిసారీ తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వర్షం కురిసినపుడు ప్రధాన రోడ్లపై రాకపోకలు సాగించడానికి భయాందోళనకు గురవుతున్నారంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. వర్షాకాల సమస్యలను ఎదుర్కొనేందుకు జీహెచ్‌ఎంసీ మాన్‌సూన్ టీమ్స్ పేరిట ప్రతి డివిజన్‌కు బృందాన్ని ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో వాహనంతో పాటు నలుగురు అత్యవసర సేవలు అందించే సిబ్బంది ఉంటారు.

- అంబర్‌పేట సర్కిల్‌లో ఆరు బృందాలను ఏర్పాటు చేశారు. గడచిన వారం రోజులుగా వర్షం పడ్డప్పుడు ఈ బృందాల జాడ కనబడ లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షం తగ్గాక ఈ బృందాలు నామ్‌కే వాస్తీగా రోడ్లపై తిరుగుతున్నాయి తప్ప వర్షం పడ్డ సమయంలో కనిపించడంలేదనేది బహిరంగ రహస్యమే. దీంతో వర్షం కురుస్తున్న సమయంలో రోడ్లపై చిక్కుకున్న వాహనదారులు రాకపోకలు సాగించడానికి జంకుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదాలు...

ఛే నంబర్ చౌరస్తా, ఫీవర్ ఆస్పత్రి, నింబోలి అడ్డ, శివం రోడ్, నారాయణగూడ, హైదర్‌గూడ ప్రధాన రోడ్ల ప్రాంతాల్లో వర్షం పడ్డ ప్రతిసారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. ప్రధాన రోడ్లపై భారీగా నీరు నిలిచిపోతుంది. రోడ్డుపై నీరు నిలవడంతో ఎక్కడ గుంత ఉందో, మ్యాన్‌హోల్ ఉందో అర్థం కాని పరిస్థితి తలెత్తుతుంది. ఆ సమయంలో ఆత్యవసర బృందాలు రోడ్డుపై నిలిచిన నీరును తొలగించడం గుంతలు ఉన్నట్లు సూచిక ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలి. అలాంటి చర్యలు అత్యవసర బృందాలు తీసుకున్న దాఖలాలు కనిపించడంలేదు. దీంతో వాహనదారులు ప్రమాదల బారిన పడే అవకాశం ఉంది.

అత్యవసర సమయంలో...

పద్మ కాలనీ ప్రాంతంలో ఏఈ సుభాష్ ఫోన్:	79950 09097
నింబోలి అడ్డా ప్రాంతంలో శ్రీనివాస్‌గౌడ్:	97013 62844
అంబర్‌పేట ప్రధాన రోడ్ రైల్వే బ్రిడ్జ్ సమీప ప్రాంతం బి.రవీందర్ ఏఎంసీ:	99899 30286
ఛే నంబర్ చౌరస్తా ఏఈ దివ్యతేజ:	73311 89492
సీపీఎల్ రోడ్ గురుద్వారా రోడ్ సమీప ప్రాంతం శ్రీకాంత్ డీఈ:	63099 81289
ముసారంబాగ్ బ్రిడ్జ్ అలీ కేఫ్ సమీప ప్రాంతం డీఈ రఘు:	99899 30624
గోల్నాక జిందాతిలస్మాత్ రోడ్ ఏఈ విజ్ఞాశ్వరి:	73311 89190

బృందాల పనితీరు మెరుగుపరుస్తాం....

వర్షాకాలంలో అత్యవసర సేవల కోసం ఏర్పాటు చేసిన బృందాల పనితీరు మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకుంటాం. వర్షాలకు తలెత్తే ఇబ్బందులను పరిష్కరించేందుకు ఈ బృందాలు పనిచేస్తాయి. ఇకపై ఈ బృందాల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తాము.

– మారుతీదివాకర్, డీఎంసీ సర్కిల్–16

16న ఆర్‌పీఐ సదస్సు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ (బొజ్జతారకం) ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ జన్ను సాంబయ్య తెలిపారు. ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ బి.సుదర్శన్, డాక్టర్ జిలకర శ్రీనివాస్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. భూమిని పంచు, బడ్జెట్‌ను పెంచు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించు అనే అంశంపై సదస్సు ఉంటుందన్నారు.

బీసీల సమగ్రాభివృద్ధిపై ఎన్‌డీఏ దృష్టి సారించాలి

కాచిగూడ: ప్రధాని నరేంద్రమోడీ బీసీలను విస్మరించినందుకే దేశ వ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేక ఫలితాలు వచ్చాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. గురువారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పదేళ్ల మోడీ పాలనలో బీసీలకు ఏమాత్రం లబ్ధి చేకూర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడం, జనగణనలో సమగ్ర కులగణన చేయకపోవడం, సామాజిక రిజర్వేషన్లను 50 శాతానికి కుదించి బీసీ రిజర్వేషన్లను తగ్గించడం, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించకపోవడం తదితర కారణాలతో బీజేపీ పట్ల ఆగ్రహాన్ని బీసీ ప్రజలు ఓటు రూపంలో చూపించారన్నారు. ఇకనైనా కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం బీసీల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా చట్ట సభల్లో బీసీ బిల్లు పెట్టి బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జనగణనలో కులగణన చేపట్టాలని, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీసీలు దేశ వ్యాప్తంగా మరో ఉద్యమం చేపడతారని హెచ్చరించారు.

నడక, ధ్యానంతో పరిపూర్ణ ఆరోగ్యం



పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

చిక్కడపల్లి: దైనందిన జీవితంలో క్రమం తప్పకుండా నడకతోపాటు ధ్యానం చేస్తే పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని పలువురు వైద్యులు పేర్కొన్నారు. అసోసియేషన్ ఫర్ ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అపోలో హాస్పిటల్స్ సహకారంతో గురువారం చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బుచ్చిరాజు మాట్లాడుతూ... ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హృద్రోగ నిపుణుడు డాక్టర్ కార్తీక్, మేనేజర్ రాహుల్‌పటేల్, అసోసియేషన్ ప్రతినిధులు లెనిన్‌బాబు, టీవీ సుందరం తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో సుమారు 105 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

విలువైన వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండాలి



బాధితులకు స్మార్ట్ ఫోన్లు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చిక్కడపల్లి: విలువైన వస్తువులు, స్మార్ట్ ఫోన్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని.. వాటిని భద్రంగా పదిలపరచుకోవాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య సూచించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫోన్లను రికవరీ చేశారు. గురువారం ఇన్‌స్పెక్టర్ సీతయ్య బాధితులు శ్రీకాంత్, రమేశ్‌లకు విలువైన స్మార్ట్ ఫోన్లు వారికి అప్పగించారు. విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

రికవరీ చేసిన సెల్‌ఫోన్లు బాధితులకు అందజేత



సెల్‌ఫోన్లు బాధితులకు అందజేస్తున్న కాచిగూడ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి

కాచిగూడ: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు సీఎస్ఐఆర్ యాప్ ద్వారా 17 సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు కాచిగూడ ఇన్‌స్పెక్టర్ పి.లక్ష్మీకాంత్ రెడ్డి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... ఈస్ట్‌జోన్ డీసీపీ ఆదేశాల మేరకు సీఎస్ఐఆర్ యాప్ ద్వారా బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులతో సెల్‌ఫోన్లను గుర్తించి రికవరీ చేస్తున్నట్లు తెలిపారు. 100 డయల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి కేసులను త్వరితగతిన పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతో ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు, పోలీసు సిబ్బంది, అందరి సహకారంతో కాచిగూడలో చట్టపరిధిలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్ఐ డి.సుభాష్, ఎస్ఐలు హెచ్.నరేష్, పి.రవికుమార్, క్రైం పోలీస్ సిబ్బంది శివ, అశోక్, శ్రీకాంత్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ హాస్టల్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ హాస్టల్స్‌లో ఏళ్ల తరబడి తక్కువ వేతనానికి పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకురాలు ఎస్‌ఎల్. పద్మ డిమాండ్ చేశారు. గురువారం ఐఎఫ్‌టీయూ అనుబంధ ప్రోగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో లేడీస్ హాస్టల్‌లో జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ విధానాన్ని రద్దుచేసి హాస్టల్స్, భోజన శాలల ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, వేతనాలను పెంచాలని ఎస్ఎల్ పద్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పర్మనెంట్ ఉద్యోగులకు ఇచ్చిన బెన్‌ఫిట్స్ ఇవ్వాలని కోరారు. యూనియన్ నాయకులు ఈశ్వర్, లక్ష్మి, వెంకటేష్, విజయ, అనిత, పద్మ, జయ, లలిత, సామ్రాజ్యం, శాంత, శ్యామల, నాహేద తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



కాచిగూడ: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భావను చూసేందుకు వచ్చిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి సమాచారం మేరకు... మంగళ్‌హాట్‌కు చెందిన రాజు(22) గత నెల 27వ తేదీన కాచిగూడలోని సాయికృష్ణ న్యూరో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బావను చూసే నిమిత్తం ఇంటి నుంచి వచ్చాడు. తిరిగి రాలేదు. ఎంత వెతికినా అతని ఆచూకీ తెలియకపోవడంతో గురువారం రాత్రి బాధితుడి తల్లి అంజమ్మ కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప సమాచారం మేరకు... సరూర్‌నగర్ ప్రాంతానికి చెందిన నాగరాజు పిల్లలు పుట్టడం లేదని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్థాపానికి గురైన నాగరాజు మలక్‌పేట రైల్వే స్టేషన్ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

రైలు ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివరాలివీ... మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం, చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కిష్టమ్మ (63) నగరంలోని శివరాంపల్లిలో కూతురు వద్ద ఉంటుంది. గురువారం ఫలక్‌నుమా–బుద్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

బ్యాగ్ చోరీపై జీరో ఎఫ్ఐఆర్

రైలులో ప్రయాణికురాలి బ్యాగు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వివరాలివీ... రాజస్థాన్‌కు చెందిన ప్రకాష్ చంద్ర ప్రజావత్ బుధవారం సూరత్ నుంచి కాచిగూడకు వస్తున్నాడు. పూర్ణ జంక్షన్ వద్ద పాస్‌పోర్టు, ఏటీఎంలు, బ్యాంక్ పాస్‌బుక్ ఉన్న బ్యాగు చోరీకి గురైంది. గురువారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీసులకు బదిలీ చేశారు.

జాతీయ క్రీడా కోడ్ అమల్లోకి తీసుకురావాలి



మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

హిమాయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం జాతీయ క్రీడా కోడ్‌ను వెంటనే అమల్లోకి తీసుకురావాలని తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పవన్ కుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఏ టోర్నమెంట్ జరిగిన సంబంధిత క్రీడల్లో గుర్తింపు కలిగిన రాష్ట్ర, జిల్లా క్రీడా సంఘాల అనుమతితోనే జరిగాయని గుర్తు చేశారు. ఇష్టారాజ్యంగా టోర్నమెంట్‌లు పెడుతూ క్రీడాకారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతర్ రాష్ట్రీయ క్రీడా పోటీల పేరుతో కొంత మంది లక్షల్లో డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. క్రీడలపై అవగాహన లేని తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ పనికి రాని ఆటలు ఆడించి ఆ తరువాత బాధ పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. క్రీడా రంగాన్ని కుల, మత, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిలోకి తెచ్చేలా ప్రభుత్వం క్రీడా ప్రణాళికలను ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్(టీఓఏ)ని ప్రక్షాళన చేసి, క్రీడా సంఘాలు ఏర్పడేలా చూడాలన్నారు. క్రీడా సంఘాలన్నింటికి సముచిత స్థానం కల్పించేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి కసపర్తి రమేష్, ప్రతినిధులు లక్ష్మణ్, తిరుమల్ రెడ్డి, విజయ్ కుమార్, సురేందర్, సంజయ్ కుమార్, సి.పుల్లయ్య పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష



నిందితులు బస్వంత్ కుమార్, నాగేందర్

హిమాయత్‌నగర్: హత్య కేసులో ఇద్దరికి కోర్టు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. వివరాలివీ... నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో వినాయక చవితి నిమజ్జనం కోసం బీదర్‌కి చెందిన సంజూ అనే వ్యక్తి 2018లో విట్టల్ వాడిలోని తన అన్న శివాజీ ఇంటికి వచ్చాడు. రాత్రి ఇంటిపై సంజూ తన స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటి యజమాని కొడుకు బస్వంత్ కుమార్, అతని స్నేహితుడు నాగేందర్‌లు వచ్చి విచక్షణ రహితంగా వారిని కొట్టి పై నుంచి కిందికి మెట్ల మీద నుంచి లాక్కొచ్చి రోడ్డుపై పడేసి కొట్టడం వల్ల బీదర్ నివాసి సంజూ హాస్పిటల్లో అడ్మిట్ అయి మృతిచెందాడు. ఈ కేసులో నిందితులైన బస్వంత్ కుమార్, నాగేందర్‌లను అరెస్టు చేసి విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో గురువారం నాంపల్లి కోర్టు న్యాయమూర్తి నిందితులిద్దరికీ పది సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 11 వేలు జరిమానా విధించారు.

ఖాజానగర్‌లో మంచినీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం



శంకుస్థాపన చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఖాజానగర్ బస్తీలో రూ. 3.05 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన 100ఎంఎం డయా మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు గురువారం గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... బస్తీలో మంచినీటి సమస్య గత కొంతకాలంగా స్థానికులను ఇబ్బంది పెడుతుందని, ఈ నేపథ్యంలో నిధులు మంజూరు చేయించినట్లు ఆమె తెలిపారు. సాధ్యమైనంత త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. వాటర్ పైప్‌లైన్ పూర్తయితే స్థానికంగా మంచినీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

బీర్ల ఐలయ్యకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలోని కురుమ సామాజికవర్గ ప్రతినిధి బీర్ల అయిలయ్యకు రాష్ట్ర మంత్రివర్గంలోకి తక్షణమే తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని తెలంగాణ కురుమ రాజకీయ జేఏసీ డిమాండ్ చేసింది. గురువారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో జేఏసీ నేత జక్కుల వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణతో కలిసి వంశీకృష్ణ మాట్లాడారు. కుల ప్రాతినిధ్యం లేకుండా దేశంలో దాదాపు ఏ మంత్రివర్గం లేదన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన బెల్లిలలితది కురుమ సామాజిక వర్గమే అని, ఆలానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలన్నారు. బీసీ ఫ్రంట్ చైర్మన్ గొరెగే మల్లేశ్ యాదవ్, జాతీయ బీసీ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ కురుమ పాల్గొన్నారు.

సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: తనపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఓయూ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) దేవిదాస్ జైజర్ ఇన్‌చార్జి వీసీ దానకిశోర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా గురువారం క్యాంపస్‌లోని పీజీ విద్యార్థుల సి – హాస్టల్ మరమ్మతుల్లో భాగంగా నూతన రేకులకు రంధ్రాలు పెద్దగా ఉండటంతో అవికాస్తా.. వర్షానికి ఉరవడంతో కమిటీ రిపోర్టు ఆధారంగా ఏఈ, డీఈ, ఈఈలకు బదులు గతేడాది మార్చి 31న నిబంధనలకు విరుద్ధంగా మాజీ వీసీ ప్రొ.రవీందర్ తనను సస్పెండ్ చేశారని వివరించారు. సస్పెండైన 15 నెలల నుంచి 75 శాతం వేతనాన్ని చెల్లిస్తున్నారని ఎంతో కాలంగా యూనివర్సిటీకి సేవలందిస్తున్న తనను సస్పెండ్ చేసి ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సస్పెన్షన్‌ను పునః పరిశీలించి ఎత్తివేయాలని ఇన్‌చార్జి వీసీ దానకిశోర్‌కు విజ్ఞప్తి చేశారు.

అవిశ్రాంత రైతు ఉద్యమ నేత అతుల్‌కుమార్ అంజాన్

అఖిల భారత కిసాన్ సభ

హిమాయత్‌నగర్: రైతుల పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర లభించే విధంగా మద్దతు ధరకు చట్టబద్ధతతో పాటు రుణ విమోచన చట్టాలను సాధించుకున్నప్పుడే అవిశ్రాంత రైతు ఉద్యమ నాయకులు, ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి దివంగత అతుల్ కుమార్ అంజాన్‌కు మనమిచ్చే ఘన నివాళి అవుతుందని రైతులు సంఘాల నాయకులు, వ్యవసాయ రంగ శాస్త్రవేత్తలు అన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బుధవారం సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు, అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి దివంగత అతుల్ కుమార్ అంజాన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్త రావుల వెంకయ్య మాట్లాడుతూ... రైతు ఉద్యమ నాయకులు అతుల్ కుమార్ అంజాన్ మరణం భారత రైతాంగంతో పాటు ఏఐకేఎస్ తీరని లోటు అన్నారు. రైతుల సమస్యలను తేట తెల్లంగా పరిష్కరించడంతో, అందుకు కావాల్సిన కార్యచరణను రూపొందించడంలో అతుల్‌కుమార్ అంజాన్ మించిన నాయకుడు లేడని కొనియాడారు. ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, వ్యవసాయ రంగ శాస్త్రవేత్తలు సోమ మర్ల, దొంతి నర్సింహారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, ఆఫీస్ బేరర్లు, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పలువురు రైతులు పాల్గొన్నారు.

‘స్వచ్ఛ హిమాయత్‌నగర్’పై అవగాహన

హిమాయత్‌నగర్: స్వచ్ఛ హిమాయత్‌నగర్ సాధన కార్యక్రమంలో భాగంగా హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ ప్రజలకు అవగాహన కల్పించారు. గురువారం విట్టల్ వాడీ, ఆయిల్ సీడ్స్ కాలనీ, ఇతర ప్రాంతాల్లో పబ్లిక్ ఏరియాలలో చెత్త వేయరాదని ప్రజలకు సూచించారు. అపార్ట్‌మెంట్, బస్తీ వాళ్లను చెత్తంతా ఇంటి వద్దకు వచ్చి ఆటోలోనే తరలించాలని కార్పొరేటర్ కోరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్‌గౌడ్, హెల్త్ ఆఫీసర్ హేమలత, మహేష్, శివయాదవ్ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి డిమాండ్

హిమాయత్‌నగర్: జీవో నెం.1ను ఉల్లంఘిస్తూ పాఠశాల పేరుతో ముద్రించిన పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, స్టేషనరీలను పాఠశాలలో విక్రయిస్తున్న హిమాయత్ నగర్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖ నిబంధనలను బేఖాతరు చేస్తున్న పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గౌతమ్ మోడల్ స్కూల్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఏఐవైఎఫ్ పోరాటంతో గౌతమ్ మోడల్ స్కూల్ పుస్తకాలు, యూనిఫామ్‌లు విక్రయిస్తున్న గదిని హైదరాబాద్ జిల్లా డిప్యూటీ విద్యాశాఖాధికారి విజయలక్ష్మి సీజ్ చేశారు. ఈ నెల 4వ తేదీన సదరు పాఠశాలకు అధికారులు వచ్చి సర్వే నిర్వహిస్తే, తమ పాఠశాలలో ఎటువంటి అమ్మకాలు జరపడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ... హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా తక్షణమే అన్ని పాఠశాలల్లో తనిఖీలు చేపట్టాలని, నిబంధనలను ఉల్లంగిస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులకు సహకరించాలని..

జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌కు వినతి



చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకారం అందించాలని కార్పొరేటర్ సామల హేమ కోరారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ అమ్రపాలిని గురువారం ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లో పలు ప్రాంతాల్లో అంతర్గత రహదారుల ఏర్పాటుకు టెండరు ప్రక్రియ చేపట్టగా.. పార్లమెంట్ ఎన్నికల ముందు టెండర్లను రద్దు చేశారని, ఆయా పనులకు రీ టెండరింగ్ చేసి నిర్మాణ పనులను చేపట్టాలని కోరారు. మహ్మద్‌గూడ, బ్రాహ్మణబస్తీ, శ్రీనివాసనగర్, ప్రైడే మార్కెట్, జోషికాంపౌండ్, భవానీనగర్ తదితర ప్రాంతాల్లో సీసీరోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారాయని, ఆయా ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించేందుకు తగిన కార్యాచరణ చేపట్టాలన్నారు. పదవీ విరమణ చేసిన పారిశుద్ధ్య కార్మికుల స్థానంలో నూతన రిక్రూట్‌మెంట్ నిర్వహించాలని, బక్రీద్ సందర్భంగా వ్యర్థాలను తరలించేందుకు గార్బేజ్ బ్యాగులు, వాహనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆమె సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు హామీ ఇచ్చారని కార్పొరేటర్ వివరించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై పోలీసుల ఫోకస్

రహమత్‌నగర్: అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాల పుటేజీలు కీలకంగా మారుతాయని, సీసీ కెమెరాలు ఏర్పాటులో ప్రజలు భాగస్వామ్యం కావాలని బోరబండ ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్ఓ భూపాల్‌గౌడ్ సూచించారు. బోరబండ పీఎస్‌లో ఆయన గురువారం మాట్లాడుతూ... విస్తత పరిధి కలిగి సమస్యాత్మక ప్రాంతలు అధికంగా ఉన్న బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో 90 సీసీ ఉన్నాయన్నారు. వాటికి మరింత పెంచే ప్రయత్నంలో పోలీసులకు స్థానికులు సహకరించాలని కోరారు. వ్యాపార కేంద్రాల వద్ద తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులకు సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై సెక్టార్ల వారీగా ప్రజలతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు ఆయన వివరించారు. ఇప్పటికే స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు సీసీ కెమెరాల ఏర్పాటు కోసం స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. ఎస్పీఆర్‌హిల్స్ క్వారీ గుట్టల్లోకి వెళ్లే దారి వద్ద నివాసాల వారితో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు భూపాల్‌గౌడ్ వివరించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

చిలకలగూడ: చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ దేవాలయంలో ఆషాడ బోనాలజాతర నిర్వహణకు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసేందుకు దేవాదాయశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఉత్సాహవంతులైన భక్తులు, ఆధ్యాత్మికవేత్తల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ నిర్వహణాధికారి మహేందర్‌గౌడ్ తెలిపారు. ఈనెల 14న ఉదయం 10 గంటలలోపు ఆలయ ప్రాంగణంలో దరఖాస్తులను పూర్తి వివరాలతో అందజేయాలని ఆయన కోరారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలోనే బోనాల జాతర నిర్వహిస్తామని వివరించారు.

లాసెట్‌లో సత్తాచాటిన మైనార్టీ గురుకుల విద్యార్థులు



అమ్మతుల్లా వాహిద్

మల్కాజిగిరి: మౌలాలిలోని మైనార్టీ గురుకుల కళాశాల సికింద్రాబాద్ గరల్స్–1 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోచింగ్ తీసుకున్న విద్యార్థులు ఐదు సంవత్సరాల లాసెట్‌లో ప్రతిభచాటారు. అమ్మతుల్లా వాహిద్ 9వ ర్యాంక్, రిజ్వాన 240, శ్రావణి 439, రుబీనా 517, రమ 672, శిరీష 764 ర్యాంక్‌లు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. 9వ ర్యాంక్ సాధించిన అమ్మతుల్లా వాహిద్ తండ్రి వాహిద్ అహ్మద్ గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తుండగా తల్లి ప్రైమరీ పాఠశాలలో మ్యాథ్స్ టీచర్‌గా పనిచేస్తున్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ కవిత అభినందించారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

అల్వాల్: అల్వాల్ హిల్స్‌లోని శ్రీపద్మావతి గోదా సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని ఆలయ ట్రస్టీ సభ్యులు, కాలనీ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.